APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ గురువారం 27 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :92 పేజీలు : 04 వెల: 2-00/-

## ఐఆర్‌సీటీసీ'తో 70 శాతం యూజర్లకు తిప్పలు.. సర్వేలో షాకింగ్ నిజాలు!




★ టికెట్ బుక్ చేస్తుండగా అకస్మాత్తుగా లాగౌట్ అవుతున్నట్టు ఫిర్యాదులు

★ ఇన్సూరెన్స్, వివరాలు వంటివి తెలియకుండానే యాడ్ అవుతున్నాయని ఆరోపణ

★ లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన దేశవ్యాప్త సర్వేలో బయటపడ్డ కీలక అంశాలు

ఢిల్లీ : ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు ఒక జాతీయ సర్వేలో వెల్లడైంది. లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన

## అమెరికాలో మోహన్ భగవత్ పర్యటనను
# నిలిపివేయడం సరికాదని చెప్పాను

❖ ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల కోసం అమెరికాకు వెళ్లిన మోహన్ భగవత్

❖ మోహన్ భగవత్ వీసా రద్దు చేయాలని అక్కడి క్రైస్తవ, ముస్లిం, సిక్కు వర్గాలు ఫిర్యాదు చేశాయన్న పాల్

❖ దీనిపై అమెరికా ప్రతినిధి ఒకరు తన అభిప్రాయాన్ని కోరారని వెల్లడి




ఢిల్లీ: ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ అమెరికా పర్యటన ప్రస్తుతం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అమెరికా, కెనడా, బ్రిటన్‌లలో 17 రోజుల పాటు జరగనున్న గ్లోబల్ అవుట్‌రీచ్ పర్యటనలో భాగంగా ఆయన న్యూయార్క్‌కు చేరుకోవడంతో ఈ అంశం దౌత్య, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పరిణామంపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మోహన్ భగవత్ అమెరికా రాకముందే ఆయన వీసాను రద్దు చేయాలంటూ అక్కడి క్రైస్తవ, ముస్లిం, సిక్కు వర్గాల సంస్థలు అమెరికా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయని

## నేపాల్ ప్రధాని బాలెన్ షాతో మాట్లాడిన మోదీ
# మానవతాసాయం చేస్తామని హామీ

❖ నేపాల్ లో మెరుపు వరదలు

❖ 105 మంది భారతీయులతో సహా 400 మంది మిస్సింగ్



ఢిల్లీ : మెరుపు వరదలతో అతలాకుతలమైన పొరుగు దేశం నేపాల్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని భారత ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారు. వరద ప్రభావిత నేపాల్‌కు సాధ్యమైనంత మానవ తాసాయం, సహాయక చర్యలను అందిస్తామని స్పష్టం చేశారు. నేపాల్ ప్రధాని బలెన్ షాతో ఫోన్‌లో మాట్లాడిన మోదీ, ఈ కష్టకాలంలో భారత ప్రజలు నేపాల్ సోదరసోదరీమణులకు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. వరద బీభత్సంతో జరిగిన ప్రాణనష్టం పట్ల ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బుధవారం ఉదయం స్థానిక కాలమానం ప్రకారం 9 గంటల ప్రాంతంలో వచ్చిన ఈ ఆకస్మిక వరద వల్ల రసువా, ధాడింగ్ జిల్లాల్లోని నదీ పరీవాహక ప్రాంతాల్లో తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. మెరుపు వరదల్లో 384 మంది ప్రయాణికులు మిగతా..2లో

## పోలవరం వద్ద గోదావరికి పోటెత్తుతున్న వరద.. 48 గేట్లు ఎత్తివేత



రెండు, మూడు రోజులుగా

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలు

పోలవరం ప్రాజెక్ట్ కాఫర్ డ్యామ్ వద్ద 30.30 మీటర్లకు చేరుకున్న గోదావరి నీటిమట్టం

4.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న అధికారులు

అమరావతి : గత రెండు, మూడు రోజులుగా తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాలలో పడుతున్న భారీ వర్షాల వల్ల గోదావరి నదిలోకి మిగతా..2లో

## తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'




భారతదేశ యువశక్తికి సరైన క్రీడా సదుపాయాలను, అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించి..

వారిలోని శక్తిసామర్థ్యాలకు పదునుపెట్టడంతోపాటుగా వారికి క్రీడా రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది.

డిసెంబర్‌లో తెలంగాణలో.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' 8 వ ఎడిషన్!

న్యూఢిల్లీ, ఆగస్టు 26: భారతదేశ యువశక్తికి సరైన క్రీడా సదుపాయాలను, అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించి.. మిగతా..2లో

## జెన్ జీ యువతతో సమావేశాలు.. కోటంరెడ్డిపై నారా లోకేశ్ ప్రశంసలు




★ యువత ఆశలు, లక్ష్యాలను తెలుసుకోవడం నాయకులకు అవసరమన్న లోకేశ్

★ యువతో జరిగే ఇలాంటి కార్యక్రమాల కోసం తాను కూడా ఎదురు చూస్తున్నానన్న మంత్రి

★ లోకేశ్ ఆలోచనల నుంచే తాను ప్రేరణ పొందానన్న కోటంరెడ్డి

అమరావతి : నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి 'జెన్ జీ' యువతతో ప్రత్యేక సమావేశాలు

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'
# ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలు

▶▶ వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

▶▶ జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని కార్యక్రమం

▶▶ కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ

▶▶ ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సంజీవని పథకం అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష



అమరావతి : రాష్ట్రంలో 2027 జనవరి 1 నుంచి "సంజీవని" ప్రాజెక్టును అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. కుప్పం, చిత్తూరులో వచ్చిన ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలను విస్తరించేందుకు 90 రోజుల కార్యాచరణను అధికారులు సిద్ధం చేశారు. ఆరోగ్య డేటా భద్రత, డిజిటల్ హెల్త్ రికార్డులు, ప్రజలకు నేరుగా హెల్త్ అప్డేట్స్ అందించే వ్యవస్థతో ఏపీని వైద్య రంగంలో ఆదర్శంగా నిలపాలని అధికారులకు సీఎం సూచించారు. సంజీవని పథకం అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును విస్తరించేందుకు అధికారులు 90 రోజుల ప్రణాళికను మిగతా..2లో

## కేసీఆర్ కోసం ఏపీని
# జగన్ నాశనం చేశారు



○ జగన్ తన పర్యటనలో 102 ప్రాజెక్టులను వెనక్కి నెట్టారన్న కొల్లు రవీంద్ర

○ అసెంబ్లీకి రాకుండా జగన్ ప్రెస్‌మీట్‌లకు పరిమితమయ్యారని ఎద్దేవా

○ రైతులకు జగన్ ఏం మేలు చేశారో చెప్పాలని డిమాండ్

అమరావతి : 2019-2024 మధ్య కాలంలో తెలంగాణ అభివృద్ధి పథంలో పయనించగా, అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయిందని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. అప్పటి తెలంగాణ మిగతా..2లో

## తెలంగాణలో పెట్టుబడుల జోరు.. ఇన్వెస్ట్ తెలంగాణకు వార్ రూమ్




★ మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది.

★ సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని,

హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే..
# రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

○ కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్

○ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ

○ లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు



హైదరాబాద్: నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఈరోజు ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మిగతా..2లో

## మల్లు భట్టివిక్రమార్కతో భేటీ.. అందుకే కలిశానన్న రాజగోపాల్ రెడ్డి




● భట్టి విక్రమార్కతో భేటీపై క్లారిటీ ఇచ్చిన రాజగోపాల్ రెడ్డి

● నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే కలిశానని వెల్లడి

● తనది స్వచ్ఛమైన కాంగ్రెస్ రక్తమని వ్యాఖ్య

● కొండా సురేఖ వివాదంపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని స్పష్టీకరణ

హైదరాబాద్: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో జరిగిన భేటీపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. బుధవారం ప్రజాభవన్‌లో ఉపముఖ్యమంత్రిని కలిసిన ఆయన, కేవలం నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కేటాయింపులపై చర్చించేందుకే ఈ భేటీ జరిగిందని వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి, తాను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న సీనియర్ నాయకుడినని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తాను తీవ్రంగా వ్యతిరేకించానని, 2018 ఎన్నికల్లో మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## పోలవరం వద్ద గోదావరికి పోటెత్తుతున్న వరద.. 48 గేట్లు ఎత్తివేత

వరద నీరు పోటెత్తుతుంది. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ప్రవాహం తీవ్రతరమైంది. ప్రాజెక్టు పరిధిలోని ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద గోదావరి నీటిమట్టం 30.30 మీటర్లకు చేరుకోగా, స్పిల్ వే వద్ద నీటిమట్టం 30.20 మీటర్లుగా నమోదైంది. వరద నీటిని క్రమబద్ధీకరించేందుకు అధికారులు స్పిల్ వేకు చెందిన 48 గేట్లను ఎత్తివేసి, దిగువకు 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి వరద ప్రభావంతో దేవీపట్నం మండలంలోని ప్రసిద్ధ గండిపోశమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లు, చుట్టుపక్కల ఉన్న దుకాణాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. పి.గొందూరు నుంచి నాగులపల్లి గ్రామాల మధ్య రహదారిపైకి వరద నీరు చేరుకోవడంతో అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదిలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున, పర్యాటకుల భద్రత దృష్ట్యా పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్ల రాకపోకలను నిలిపివేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## జెన్ జీ యువతతో సమావేశాలు.. కోటంరెడ్డిపై నారా లోకేశ్ ప్రశంసలు

నిర్వహించడం పట్ల ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. తర్వాతి తరం ఆలోచనలను అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక అద్భుతమైన చొరవ అని ఆయన కొనియాడారు. ప్రస్తుత యువత ఆశలు, లక్ష్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, వారి నూతన ఆలోచనలను తెలుసుకోవడం నాయకులకు ఎంతో అవసరమని లోకేశ్ అన్నారు. యువత ఆకాంక్షలను సరిగ్గా అర్థం చేసుకుని, వారికి ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందించడానికి ప్రజాప్రతినిధులు వారితో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. యువతతో జరిగే ఇటువంటి ఆసక్తికరమైన, లోతైన భావాల మార్పిడి కార్యక్రమాల కోసం తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపారు. మరోవైపు, లోకేశ్ అభినందనలపై కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పందిస్తూ... నారా లోకేశ్ దార్శనికత, ఆలోచనల నుంచి ప్రేరణ పొందే తాము ఈ 'జెన్ జీ' సమావేశాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. నవతరం యువత ఆలోచనలు, వారి ఆకాంక్షలు, ప్రభుత్వంపై వారి అంచనాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.

## కేసీఆర్ కోసం ఏపీని జగన్ నాశనం చేశారు: కొల్లు రవీంద్ర

సీఎం కేసీఆర్‌కు తలొగ్గి జగన్ రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర ద్రోహం చేశారని ఆయన విమర్శించారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో ఏకంగా 102 ప్రాజెక్టుల టెండర్లను రద్దు చేసి అభివృద్ధిని వెనక్కి నెట్టారని, ఆయన హయాంలో జరిగిన అరాచకాలు, దోపిడీని ప్రజలు ఇంకా మర్చిపోలేదని మండిపడ్డారు. చట్టసభలు, అసెంబ్లీ సమావేశాలకు జగన్ హాజరుకాకుండా కేవలం ప్రెస్‌మీట్‌లకే పరిమితం కావడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. రైతుల సంక్షేమం గురించి మాట్లాడే జగన్, తన పాలనలో రైతులకు అసలు ఏం మేలు చేశారో చెప్పాలని నిలదీశారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో తమ కూటమి ప్రభుత్వానికి, జగన్ పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ... తమ ప్రభుత్వంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.13,500 కోట్లు ఖర్చు చేయగా, జగన్ తన ఐదేళ్ల కాలంలో వెలుగొండ ప్రాజెక్టుకు కేవలం రూ.800 కోట్లు మాత్రమే వెచ్చించారని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా 'ఎల్‌నినో' ప్రభావం ఉన్నప్పటికీ, ఇలాంటి ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలిచిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొల్లు రవీంద్ర కొనియాడారు.

## నేపాల్ ప్రధాని బాలెన్ షాతో మాట్లాడిన మోదీ మానవతాసాయం చేస్తామని హామీ

గల్లంతైనట్లు నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది. వీరిలో 291 మంది విదేశీయులు కాగా, 93 మంది నేపాల్ పౌరులు ఉన్నారు. గల్లంతైన విదేశీయుల్లో అత్యధికంగా 105 మంది భారతీయ పర్యాటకులు, 37 మంది ఎన్నారైలు ఉన్నట్లు పేర్కొంది. వీరితో పాటు అమెరికా, బ్రిటన్, మలేసియా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్‌కు చెందిన పర్యాటకులు కూడా వరదల్లో చిక్కుకుపోయినట్లు గుర్తించారు. బాధితులు, పర్యాటకుల సమాచారం కోసం నేపాల్ టూరిజం బోర్డు ప్రత్యేక సహాయక నంబర్లను అందుబాటులోకి తెచ్చింది.

## అమెరికాలో మోహన్ భగవత్ పర్యటనను నిలిపివేయడం సరికాదని చెప్పాను

కేఏ పాల్ తెలిపారు. ఈ నేపథ్యంలో వీసా రద్దు చేసే అధికారం ఉన్న అమెరికా ప్రతినిధి ఒకరు తన అభిప్రాయాన్ని కోరినట్లు వెల్లడించారు. ఒక ప్రజాస్వామ్య దేశంలో మోహన్ భగవత్ పర్యటనను నిలిపివేయడం సరికాదని, ప్రతి ఒక్కరికీ ఒకే రకమైన భావప్రకటనా స్వేచ్ఛ ఉండాలని తాను అమెరికా నాయకులకు స్పష్టం చేసినట్లు చెప్పారు. మరొకవైపు, ఆగస్టు 29న న్యూయార్క్‌లోని ప్రసిద్ధ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో 'యూనివర్సల్ వన్‌నెస్ సెలబ్రేషన్స్' పేరిట జరగనున్న బృహత్ సభలో మోహన్ భగవత్ ప్రసంగించనున్నారు. అయితే ఈ పర్యటనపై అమెరికాలోని హక్కుల సంఘాల నుంచి నిరసనలు, మద్దతు రెండూ వ్యక్తమవుతుండటంతో ఆయన పర్యటన మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సభ ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని, సోదరభావాన్ని కాపాడుతామని భగవత్ స్పష్టమైన సందేశం ఇవ్వాలని కేఏ పాల్ కోరారు.

## మల్లు భట్టివిక్రమార్కతో భేటీ.. అందుకే కలిశానన్న రాజగోపాల్ రెడ్డి

ఎంతోమంది సీనియర్లు ఓటమి పాలైనప్పటికీ మునుగోడు ప్రజలు తన వెంటే నిలిచారని ఆయన గుర్తుచేశారు. తన వ్యాఖ్యలు పార్టీ బలోపేతం కోసమే తప్ప, ఎవరినీ వ్యక్తిగతంగా విమర్శించేందుకు కాదని స్పష్టం చేశారు. "మాది స్వచ్ఛమైన కాంగ్రెస్ రక్తం. ఎన్నికల సమయంలో కొత్తగా వచ్చిన వారికి టికెట్లు కేటాయించారు. అయితే, పార్టీని నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై స్పందిస్తూ, ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయమే అంతిమమని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పందించారని, క్రమశిక్షణ సంఘం కూడా సంబంధిత వ్యాఖ్యలపై పీసీసీకి నివేదిక సమర్పించిందని తెలిపారు. తనపై విమర్శలు చేసే వారు ముందుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించిన ఆయన, తాను ఎల్లప్పుడూ పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానని వెల్లడించారు. రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే తమ ప్రధాన లక్ష్యమని రాజగోపాల్ రెడ్డి పునరుద్ఘాటించారు.

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## భారత్ 'ధర్మశాల' కాదు చొరబాట్లను ఉపేక్షించబోం: అమిత్ షా

దేశంలో నివసించే హక్కు కేవలం భారత పౌరులకే ఉంటుందని, ఇదేమీ 'ధర్మశాల' కాదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దిల్లీలో ఇంటెలిజెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీస్ సదస్సు- 2026లో ఆయన పాల్గొని మాట్లాడారు. అక్రమంగా చొరబడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతామని, అతి త్వరలోనే దేశాన్ని పూర్తిగా 'చొరబాట్ల రహిత' ప్రాంతంగా మారుస్తామన్నారు. గత ఎనిమిది నెలల కాలంలో దేశంలోని అన్ని భూ సరిహద్దు రాష్ట్రాలను స్వయంగా సందర్శించినట్లు అమిత్ షా ఈ సందర్భంగా గుర్తుచేశారు. సరిహద్దు రక్షణ కోసం నాలుగు అంచెల విధానంతో కూడిన మార్గదర్శకాలను రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. "ఈ దేశం ఏమాత్రం ధర్మశాల కాదు. ఇక్కడ జీవించే హక్కు కేవలం ఈ దేశ పౌరులకు మాత్రమే ఉంది. అక్రమ చొరబాట్లు దేశ రక్షణకు మాత్రమే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా, జనాభా సమతుల్యతను మార్చేస్తున్నాయి. వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. రానున్న 15-20 ఏళ్లలో తలెత్తగల భద్రతా సవాళ్లను ముందే ఊహించి, వాటిని ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచించాల్సిన అవసరం ఉంది"

**- అమిత్ షా, కేంద్ర హోంశాఖ మంత్రి**

దేశంలో నేర విచారణ వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు కొత్త నేర చట్టాలు దోహదం చేస్తాయని అమిత్ షా అభిప్రాయపడ్డారు. రానున్న ఒక సంవత్సరంలో కొత్తగా తీసుకువచ్చిన మూడు క్రిమినల్ చట్టాలను 100 శాతం అమలు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ చట్టాల అమలు ద్వారా ఏదైనా క్రిమినల్ కేసుకు సంబంధించి కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు విచారణ ప్రక్రియ కేవలం మూడేళ్లలోపే పూర్తవుతుందని, తద్వారా నేరస్థుల శిక్షా రేటు కనీసం 25 శాతం పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఐఆర్‌సీటీసీ'తో 70 శాతం యూజర్లకు తిప్పలు.. సర్వేలో షాకింగ్ నిజాలు!

మొదటి పేజి తరువాయి

ఈ సర్వే ప్రకారం, దాదాపు 70 శాతం మంది వినియోగదారులు సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తేలింది. టికెట్లు బుక్ చేసే సమయంలో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే తమ ఖాతాలు ఉన్నట్టుండి లాగౌట్ అవుతున్నాయని మెజారిటీ వినియోగదారులు ఫిర్యాదు చేశారు. సర్వేలో పాల్గొన్న వారిలో 42 శాతం మందికి ఈ సమస్య తరచుగా ఎదురవుతుండగా, 28 శాతం మంది అప్పుడప్పుడు ఇటువంటి అనుభవం ఎదురవుతోందని తెలిపారు. ఇలా అకస్మాత్తుగా లాగౌట్ అవ్వడం వల్ల అనుకున్న రైలులో బెర్తులు దొరక్కపోవడం లేదా నిర్దేశిత సీట్లను కోల్పోవాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా మరో ఐదు రకాల సమస్యలు కూడా యూజర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఈ సర్వే గుర్తించింది. వాటిలో ప్రధానంగా: నాగింగ్ (46 శాతం): టికెట్




బుకింగ్ లేదా రద్దు సమయంలో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని లేదా వ్యక్తిగత సమాచారం అందించాలని పదేపదే ఒత్తిడి చేయడం. బాస్కెట్ స్నీకింగ్ (45 శాతం): వినియోగదారుల ప్రమేయం లేకుండానే ఇన్సూరెన్స్, విరాళాలు వంటి అదనపు రుసుములను గుట్టుచప్పుడు కాకుండా బిల్లులో చేర్చడం. డ్రిప్ ప్రైసింగ్ (43 శాతం): పన్నులు మినహా ఇతర ఛార్జీలను ముందుగా వెల్లడించకుండా, తుది చెల్లింపు సమయంలో మాత్రమే చూపించడం. బైట్ అండ్ స్విచ్ (38 శాతం): తొలుత ఎంచుకున్న రైలు, సీటుకు బదులుగా బుకింగ్ ప్రక్రియ ముగిసే సమయానికి మరొకటి కేటాయించడం. ఇంటర్‌ఫేస్ ఇంటర్‌ఫియరెన్స్ (31 శాతం): బుకింగ్ ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు ఇతర ప్రమోషన్లు లేదా ప్రకటనలు అడ్డురావడం. దేశవ్యాప్తంగా 324 జిల్లాల్లోని 90,000 మందికి పైగా వినియోగదారుల నుంచి లోకల్‌సర్కిల్స్ ఈ వివరాలను సేకరించింది. వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఐఆర్‌సీటీసీ జులై మధ్యలో కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కొద్దికాలానికే ఈ సర్వే ఫలితాలు వెలువడటం గమనార్హం. ముఖ్యంగా రద్దీ సమయాల్లో టికెట్ బుకింగ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఇంకా కొనసాగుతున్నాయని ఈ సర్వే నివేదిక స్పష్టం చేస్తోంది.

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' - ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలు

మొదటి పేజి తరువాయి

సీఎంకు వివరించారు. ఇందులో బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, వైద్య సిబ్బందికి శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో అనుసంధానం వంటి అంశాలను చేర్చారు. మొత్తం 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి ఈ పథకం అమలుపై శిక్షణ ఇవ్వనున్నారు. వైద్య సేవలను ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్ విధానంలో అందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థ: చికిత్సతో పాటు ప్రజల ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానంలో ఆరోగ్యకరమైన మార్పులు తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. హోమియోపతి, ఆయుర్వేదం, యోగా, ప్రాణాయామంతో పాటు ఆధునిక వైద్య విజ్ఞానాన్ని సమన్వయం చేయాలని ఆదేశించారు. ఏఐ డాక్టర్ సేవలను విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నారు. వైద్య డేటా భద్రత, గోప్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సమగ్ర డ్యాష్‌బోర్డును రూపొందించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ: ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యంతో పాటు వివిధ ఔట్‌సోర్సింగ్ సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం అధికారులకు సూచించారు. సమర్థవంతంగా సేవలు అందించని ఔట్‌సోర్సింగ్ సంస్థలను తొలగించే విధానం రూపొందించాలన్నారు. ప్రజల్లో వైద్య వ్యవస్థపై విశ్వాసం పెరిగేలా సేవలు ఉండాలని మొబైళ్లకు నేరుగా ఆరోగ్య సంబంధిత సమాచారం చేరేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని ఆదేశించారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని ప్రాజెక్టు అమలు వల్ల వచ్చిన ఫలితాలను సమీక్షలో అధికారులు వివరించారు. చిత్తూరులో హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం నియంత్రణలోకి రాగా, డయాబెటిస్ కేసుల్లో 16 శాతం తీవ్రత తగ్గినట్టు తెలిపారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు: ప్రాథమిక ఆరోగ్య సేవల వినియోగం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. సంజీవని సేవలపై నిర్వహించిన పౌరుల సర్వేలో 91 శాతంమంది తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని అభిప్రాయపడ్డారని ఈ ఫలితాలను రాష్ట్రవ్యాప్త అమలుకు



ప్రాతిపదికగా తీసుకోవాలని సీఎం సూచించారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు.

## తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

మొదటి పేజి తరువాయి

'ఖేలో ఇండియా యూత్ గేమ్స్', 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్', 'ఖేలో ఇండియా పారా గేమ్స్', 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్', 'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్', 'ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్', 'ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్' వంటి క్రీడా పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను, తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు జరిగిన 24 ఎడిషన్ల 'ఖేలో ఇండియా ' పోటీల్లో దేశం నలుమూలల నుంచి 60 వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరంపరలో భాగంగా.. ఈ ఏడాది జరగనున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' ను తెలంగాణలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికగా ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఎడిషన్‌లో మొత్తం 25 క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రమైన తెలంగాణ.. ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించవచ్చు. దీంతో పాటుగా మరో కొత్త క్రీడను కూడా ఈ ఈవెంట్లో ఆడించనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 6వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా. ఈ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' నిర్వహణకోసం.. కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లను విడుదల చేసింది. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఖేలో ఇండియా పథకం అడ్‌హక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త నిర్వహణలో నిర్వహించనున్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణకు కేటాయించడం పట్ల.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి మన్సుఖ్ మాండవీయకు ధన్యవాదాలు తెలియజేశారు. భారత యువతలో అపారమైన క్రీడా




ప్రతిభ ఉందని, వారికి తగిన క్రీడా సదుపాయాలు కల్పించడం, అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడం, ప్రతిభను వెలితీయడంలో గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. స్పోర్ట్స్ బడ్జెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత.. స్పోర్ట్స్ బడ్జెట్ కేటాయింపులు పెరిగాయని, ఖేలో ఇండియా వంటి పథకాల ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న క్రీడా ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. 'ఖేలో ఇండియా' స్కీమ్‌లో భాగంగా.. తెలంగాణలో కూడా దాదాపు రూ.30 కోట్లతో క్రీడా సదుపాయాల కల్పన జరిగిందని, అందులో రూ.11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, మహిళల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలను కల్పించారని, మరో రూ.18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో క్రీడా సదుపాయాలను కల్పించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో 33 ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మరో రూ.8.5 కోట్లను తెలంగాణలో క్రీడాభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఖేలో ఇండియా స్కీమ్, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ అసిస్టెన్స్ టు నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ , స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్కీమ్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలనిస్తున్నాయి. తెలంగాణకు చెందిన అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్.. టాప్స్ ప్రోగ్రామ్ సహాయంతో ఇవాళ భారతదేశ కీర్తిపతాకను రెపరెపలాడిస్తోంది. ఈ పథకం ద్వారా ఆమెకు అత్యాధునిక శిక్షణతోపాటుగా అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని అనుభవం గడించేందుకు ప్రోత్సాహం లభించింది. తెలుగు తేజం.. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా.. టాప్స్ కార్యక్రమం ద్వారా.. అంతర్జాతీయ స్థాయి శిక్షణ, సపోర్టింగ్ స్టాఫ్ సహకారంతో.. ఒలింపిక్స్ మెడల్ సాధించింది. క్రీడారంగంలో ఆమె రాణిస్తున్న తీరును ప్రోత్సహిస్తూ.. కేంద్ర ప్రభుత్వం 2015లో పద్మశ్రీ, 2020లో పద్మభూషణ్ అవార్డును అందించింది. ఇలాంటి క్రీడాకారులెందరికో.. కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2014కు ముందు మొత్తం 23 ఒలింపిక్స్ ఎడిషన్లలో.. 23 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 వరకు మూడు ఎడిషన్లలో 15 పతకాలు సాధించాం. పారాలింపిక్స్‌లోనూ.. 2014కు ముందు దేశం కేవలం 8 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 పారాలింపిక్స్ లో.. 52 పతకాలు సాధించాం. 2014కు ముందు దేశంలో స్పోర్ట్స్ బడ్జెట్ రూ.1,219 కోట్లుండగా.. 2025-26లో ఇది రూ.3,794 కోట్లకు పెరిగింది. దేశంలో 2014కు ముందు రూ.191 కోట్ల విలువైన 38 స్పోర్ట్స్ ప్రాజెక్టులుండగా.. ఈ 12 ఏళ్లలో 350 స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు పూర్తయ్యాయి. వీటి విలువ రూ.3,181 కోట్లు. మరో వైపు, ఆగస్టు 29న నేషనల్ స్పోర్ట్స్ డే ను పురస్కరించుకుని.. గురువారం (ఆగస్టు 27న).. దేశవ్యాప్తంగా 'ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్' పేరుతో ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి.. 2 కాలేజీల చొప్పున 1,500 లకు పైగా కాలేజీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రీడలు, ఫిట్‌నెస్‌తో పాటు యువత నేతృత్వంలో దేశ నిర్మాణానికి సంబంధించిన అంశాల మీద ప్రధాని మోదీ.. వర్చువల్‌గా ప్రసంగించడంతోపాటు క్రీడల పట్ల యువత ఆలోచనలు, ఆకాంక్షల గురించి వారితో మాట్లాడి తెలుసుకోనున్నారు.

## తెలంగాణలో పెట్టుబడుల జోరు.. ఇన్వెస్ట్ తెలంగాణకు వార్ రూమ్

మొదటి పేజి తరువాయి

ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం నాడు మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు. సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజువారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి



కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

## గణేశుడి కోసం 3.5అడుగుల భారీ రాఖీ- గత 24 ఏళ్లుగా సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న ఫ్యామిలీ!

వినూత్నమైన సంప్రదాయాన్ని పెట్టుకున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబం

రక్షాబంధన్ సందర్భంగా ఖజ్రానా వినాయకుడికి భారీ రాఖీ సమర్పిస్తున్న ఫ్యామిలీ-

రెండు దశాబ్దాల క్రితం నుంచి కొనసాగుతున్న ఆచారం

దేశవ్యాప్తంగా ఉన్న సోదర-సోదరిమణులు రక్షాబంధన్ వేడుకలకు సిద్ధమవుతున్నవారు. ఈ క్రమంలో మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌కు చెందిన ఓ కుటుంబం ప్రముఖ ఖజ్రానా గణేశుడికి 3.5 అడుగుల భారీ రాఖీని కట్టేందుకు రెడీ అవుతోంది. ఏటా రాఖీ పండుగ సందర్భంగా ఈ ఫ్యామిలీ నగరంలోనే అతిపెద్ద రాఖీని గణేశుడికి సమర్పించే సంప్రదాయం గత కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో వినాయకుడి భారీ రాఖీ కడుతున్న ఫ్యామిలీ ఏది? ఈ సంప్రదాయం ఎప్పటి నుంచి ఉంది? తదితర విషయాలు తెలుసుకుందాం.

24 ఏళ్లుగా ఇదే ఆచారం

పాల్‌రేచా కుటుంబం గత 24 ఏళ్లుగా ఇందౌర్‌లోని ఖజ్రానా గణేశుడికి రాఖీని కట్టే సంప్రదాయాన్ని కొనసాగిస్తోంది. ఏటా దేవుడి కోసం ఒక భారీ రాఖీని తయారు చేస్తోంది. ఈ ఏడాది కూడా వివిధ దేవతామూర్తుల ఫొటోలతో భక్తిభావం, చైతన్యం ప్రతిబింబించేలా 40×40 అంగుళాల (3.5 అడుగులు) రాఖీని రూపొందించింది. ఈ భారీ రాఖీలో జగన్నాథ స్వామి, బాబా మహాకాల్, భోజ్‌శాల మాతా వాగ్దేవి, మహాలక్ష్మి , మహాకాళి వంటి దేవతామూర్తుల చిత్రాలు కనిపిస్తాయి. పాల్‌రేచా కుటుంబ సభ్యులు శాంతను, పుండరీక్, ధీరజ్, జయేశ్, మితేష్ సహా ఇంకొందరు కలిసి ఈ రాఖీని



తయారుచేయడానికి గత రెండున్నర నెలలుగా రేయింబవళ్లు శ్రమించారు. పాల్‌రేచా కుటుంబం కొవిడ్ తర్వాత వాణిజ్యపరమైన రాఖీల తయారీ వ్యాపారాన్ని నిలిపివేసింది. అయినప్పటికీ రక్షాబంధన్ సందర్భంగా గణేశుడి కోసం రాఖీని తయారుచేయడానికి కుటుంబ సభ్యులందరూ ఏకమవుతారు. ఈ ఏడాది నేహా పాల్‌రేచా (పాల్‌రేచా ఫ్యామిలీ కోడలు) రాఖీ థీమ్ రూపకల్పన నుంచి తయారీ వరకు అన్ని పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. రంగురంగుల రత్నాలుతో తీర్చిదిద్దిన ఈ రాఖీ దేవతామూర్తుల సజీవ చిత్రణలతో కూడిన అద్భుతమైన కళాఖండంగా కనిపిస్తోంది. కాగా, ఖజ్రానా గణేశ్ ఆలయానికే కాకుండా వీర్ అలిజా సర్కార్ మహాకాల్ గుడి, దేశవ్యాప్తంగా ఉన్న ఇతర వినాయకుడి దేవాలయాలకు తాము రాఖీలను తయారు చేసి పంపుతామని నేహా తెలిపారు. తమ కుటుంబం తయారు చేసిన రాఖీలు గతంలో లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నాయని పేర్కొన్నారు.

కుటుంబ పెద్ద ఏమన్నారంటే?

తమ ఫ్యామిలీ గత 50 ఏళ్లుగా రాఖీ తయారీ వ్యాపారంలో ఉందన్నారు కుటుంబ పెద్ద పుండరీక్ పాల్‌రేచా. వ్యాపార ప్రారంభ రోజుల్లో రాఖీల తయారీ ప్రక్రియ ఎప్పుడూ ముందుగా గణేశుడి కోసం ఒక రాఖీని రూపొందించడంతోనే మొదలయ్యేదని వివరించారు. కాలక్రమేణా ఇదొక సంప్రదాయంగా మారిందన్నారు. అమ్మకం కోసం రాఖీలను తయారు చేయడానికి ముందు కుటుంబ సభ్యులు మొదట దేవుడి కోసం ఒక అద్భుతమైన, అందమైన రాఖీని రూపొందిస్తారని వెల్లడించారు. ఆ తర్వాత ఆ రాఖీని కుటుంబ సభ్యులంతా సంగీత వాద్యాల నడుమ ఉత్సాహభరితమైన, భక్తి వాతావరణంలో దేవుడికి సమర్పించడానికి వెళ్తామని చెప్పారు. ఈ ఆచారాన్ని తమ మూడో తరం కూడా భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తోందని స్పష్టం చేశారు.

3.5 అడుగుల భారీ రాఖీ

ఇతర రాష్ట్రాలకు పాకిన పాల్‌రేచా రాఖీ మేనియా

పాల్‌రేచా కుటుంబం తయారు చేసే రాఖీల కీర్తి ఇతర రాష్ట్రాలకు కూడా పాకింది. దీంతో రాఖీకి తయారీకి అవసరమైన వివిధ ముడి సరకులను సరఫరా చేసే పొరుగు రాష్ట్రాల వ్యాపారులకు పాల్‌రేచా కుటుంబంతో మంచి అనుబంధం ఏర్పడింది. సరకులను సరఫరా చేసిన తర్వాత ఆ వ్యాపారులు ఏటా గణేశుడి కోసం తయారుచేసే భారీ రాఖీని చూసేందుకు వస్తుంటారు. ఈ ఏడాది పాల్‌రేచా ఫ్యామిలీ తమ రాఖీకి 'సనాతన్ రాఖీ' అని పేరు పెట్టింది. దీని తయారీలో కోల్‌కతా, జైపూర్, ముంబయి, సూరత్ ప్రాంతాల నుంచి సేకరించిన అలంకరణ సామగ్రిని ఉపయోగించారు. చివరగా దీనికి సంప్రదాయ రాఖీ రూపాన్ని కల్పించేందుకు ఇరువైపులా పవిత్ర దారాలను కట్టారు. ఈ ఏడాది పాల్‌రేచా ఫ్యామిలీ రూపొందించిన రాఖీని చూసేందుకు సూరత్ నుంచి భూపేంద్ర రకారియా ఇందౌర్‌కు వచ్చారు. "భారీ రాఖీని తయారు చేసి దేవుడికి సమర్పించే సంప్రదాయం దేశంలో మరెక్కడా లేదు. అందుకే దేవుడికి రాఖీని సమర్పించే మొత్తం ప్రక్రియను కళ్లారా చూడాలనే కోరికతో నేను ప్రతి సంవత్సరం నా కుటుంబంతో కలిసి ఇందౌర్ వస్తుంటాను. ఈ ఏడాది సనాతన్ ఇతివృత్తం ఆధారంగా పాల్‌రేచా ఫ్యామిలీ రాఖీని రూపొందించింది.

# మానవాళి శ్రేయస్సు కోసం కృషి చేసిన కారణజన్ముడు మహ్మద్ ప్రవక్త

అనంతపురం, ఆగస్టు 26 అనంత సూర్య : మానవళి శ్రేయస్సు కోసం కృషి చేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఆయన నగరంలోని పలు దర్గాలను సందర్శించారు. ముందుగా పాతూరులోని బంగారువీధిలో ఉన్న శ్రీ సయ్యదా మాసుమా బీబీ సాహెబా, సారాన్ బీబీ సాహెబా దర్గాకు వెళ్లారు. అక్కడ ముస్లిం సోదరులు ఎమ్మెల్యే దగ్గుపాటికి ఘన స్వాగతం పలికారు. దర్గాలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆసార్ స్ట్రీట్ లోని ఆసార్ దర్గాను దర్శించుకున్నారు. అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని.. మహమ్మద్ ప్రవక్త పవిత్ర కేసాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలియజేశారు.





మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీగా జరుపుకుంటారని.. ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, పరస్పర సహకారం వంటి విలువలను గుర్తు చేశారు. ప్రవక్త బోధనలను పాటిస్తూ శాంతి, సోదరభావంతో జీవించాలని సూచించారు.హాశాంతియుత సమాజం కోసం మహ్మద్ ప్రవక్త కృషి చేశారని.. ఆయన సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, నగర ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, కార్పొరేటర్ బాబా, టిడిపి మైనార్టీ నాయకులు అడ్వకేట్ ఇషాక్, నియాజ్ అహ్మద్, ఇస్మాయిల్, మున్వర్, షౌకత్, నదీమ్, దాదా పీర్, ముస్తాక్, ఇమ్రాన్, అస్లాం, దాదు, ఖాజాపీర్, జాకీర్, ఇక్బాల్, సికిందర్, నూర్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ ప్రత్యేక ప్రార్థనలు

## ఆయా దర్గాల్లో ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంత కలెక్టరేట్ : ఆగస్టు 26 (అనంత సూర్య) : మానవళి శ్రేయస్సు కోసం కృషి చేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ఆయన నగరంలోని పలు దర్గాలను సందర్శించారు. ముందుగా పాతూ-



రులోని బంగారువీధిలో ఉన్న శ్రీ సయ్యదా మాసుమా బీబీ సాహెబా, సారాన్ బీబీ సాహెబా దర్గాకు వెళ్లారు. అక్కడ ముస్లిం సోదరులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. దర్గాలో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆసార్ దర్గాను దర్శించుకున్నారు. అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని ముస్లిం సోదరులకు ఆయన మిలాద్ ఉన్ నబి శుభాకాంక్షలు తెలియజేశారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీగా జరుపుకుంటారని ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, పరస్పర సహకారం వంటి విలువలను గుర్తు చేశారు. ప్రవక్త బోధనలను పాటిస్తూ శాంతి, సోదరభావంతో జీవించాలని సూచించారు. శాంతియుత సమాజం కోసం మహ్మద్ ప్రవక్త కృషి చేశారని ఆయన సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు.

# రూ.3 కోట్లతో 43 జలాధార పనులు...

## ప్రతి నీటి బొట్టును ఒడిసిపడతాం - రాష్ట్ర మంత్రి సవితమ్మ

పెనుకొండ, ఆగస్టు 26:( అనంత సూర్య) : పెనుకొండ నియోజకవర్గంలో సాగు, తాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు భూగర్భ జలాలను పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన జలాధార పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. గోరంట్ల మండలం గౌనివారిపల్లి పంచాయతీలో జరుగుతున్న జలాధార పనులను బుధవారం ఆమె పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులను పూర్తి చేయాలని ఆదేశించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెనుకొండ నియోజకవర్గంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో 43 జలాధార పనులు చేపట్టినట్లు తెలిపారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలమట్టాలను పెంచడం, చెర-ువులు, నీటి వనరులను అభివృద్ధి చేయడం ద్వారా



రైతులు, ప్రజలకు ప్రయోజనం కల్పించడమే జలాధార కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడకుండా అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం గౌనివారిపల్లి పంచాయతీ చెట్లమొరంపల్లి గ్రామంలో'2 ఏళ్ల నమ్మకంఅభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొన్నారు. స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పెనుకొండ నియోజకవర్గంలో మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పూర్తయిన ప్రాజెక్టుల వివరాలను కరపత్రాల ద్వారా ప్రజలకు తెలియజేశారు.

ఈ సందర్భంగా ప్రజల సమస్యలను మంత్రి అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, పెనుకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి నిరంతరం కట్టుబడి ఉన్నామని సవిత తెలిపారు. కార్యక్రమాల్లో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గోరంట్లలో త్వరలో ఎన్టీఆర్ అన్న క్యాంటీన్

ఆగస్టు 26: ( అనంత సూర్య) : నియోజకవర్గం గోరంట్ల పట్టణ కేంద్రంలో త్వరలో మంత్రి సొంత నిధులతో ప్రారంభించనున్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ ఏర్పాట్లను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి శ్రీమతి సవితమ్మ స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి



పరిశీలించారు. పేదలు, కార్మికులు, నిరుపేద కుటుంబాలకు తక్కువ ధరకే నాణ్యమైన భోజనం అందించాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి తెలిపారు.

# అనంత అర్బన్ లో 30 పోలీస్ యాక్ట్'

## నెల రోజుల పాటు అమలులో ఉత్తర్వులు

### - అనంతపురం అర్బన్ డీఎస్పీ

అనంత క్రైమ్, ఆగస్టు 26: (అనంత సూర్య) : అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈనెల 27వ తేదీ నుంచి వచ్చే నెల 26వ తేదీ వరకు (నెల రోజుల పాటు) 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని డీఎస్పీ ఎం. చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆదేశాల ప్రకారం సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు,



రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ధర్నా చౌక్‌లు, ర్యాలీలు, సభలు, సమావేశాలు మరియు మైకులు ఉపయోగించే కార్యక్రమాలు నిర్వహించకూడదని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా, ముందస్తు అనుమతి లేకుండా నిరసనలు చేపట్టినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణంలో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు, ప్రజాసంఘాలు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని డీఎస్పీ కోరారు.

# వైసీపీ యువజన విభాగంలో పలువురికి చోటు

అనంతపురం, ఆగస్టు 26 అనంత సూర్య : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మణికంఠ రాయల్, జిల్లా కార్యదర్శిగా కేసీ హర్షవర్ధన్‌లను నూతన బాధ్యతలు లభించాయి. పార్టీ అధిష్ఠానం యువతకు ప్రాధాన్యత కల్పిస్తూ వివిధ పదవులను కేటాయించడంపై నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మణికంఠ రాయల్, కేసీ హర్షవర్ధన్‌లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వారు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి యువతను పెద్ద-ఎత్తున భాగస్వామ్యం చేస్తూ గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. 2029 ఎన్నికల్లో వైఎస్సార్





కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని, అందుకోసం యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేసి, పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తామని నూతన బాధ్యతలు పొందిన నాయకులు పేర్కొన్నారు.

# గుంతకల్ సబ్ డివిజన్ పరిధిలో 30 యాక్ట్ అమలు

## - గుంతకల్ డి.ఎస్.పి



గుంతకల్ క్రైమ్, ఆగస్టు 26:( అనంత సూర్య) : గుంతకల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో క్రింద తెలిపిన పట్టణాలలో పోలీస్ 30 యాక్ట్ అమలు చేస్తున్నట్లు గుంతకల్ డిఎస్పి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉరవకొండ టౌన్, గుంతకల్లు , విడపనకల్లు,పాల్తూరు, వజ్రకరూరు, కసాపురము, పామిడి మరియు గుత్తి పోలీస్ స్టేషన్ల పరిధిలో 1.8.2026 నుండి 31.8.2026 వరకు పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉన్నది. కావున, ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు ధర్నాలు, రాస్తారోకోలు లేదా ఇతర బహిరంగ కార్యక్రమాలు నిర్వహించ దలచినట్లయితే, తప్పనిసరిగా సంబంధిత పోలీస్ అధికారుల నుండి ముందస్తు అనుమతి పొందవలెను. పోలీసుల నుండి ముందస్తు అనుమతి పొందకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు లేదా ఇతర కార్యక్రమాలు నిర్వహించినట్లయితే, సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడును. కావున ప్రజలు, నిర్వాహకులు మరియు సంబంధిత వ్యక్తులు పోలీస్ అధికారుల నుండి ముందస్తు అనుమతి తీసుకున్న తరువాత మాత్రమే కార్యక్రమాలను నిర్వహించవలసిందిగా సూచించడమైనది.

# ఎమ్మెల్సీ రమాదేవి దంపతులకు ఆత్మీయ సన్మానం

## - ఎమ్మెల్సీని కలిసిన తెలంగాణా, ఆంధ్రా వడ్డెర సంఘం నేతలు

అనంతపురం, ఆగస్టు 26 అనంత సూర్య : గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎంపికైన దలవాయి రమాదేవి, ఆమె భర్త దలవాయి వెంకటనారాయణలను తెలంగాణా, ఆంధ్రా వడ్డెర సంఘం నేతలు శాలువా కప్పి, జ్ఞాపికతలను అందజేసి సత్కరించారు. కదిరి డాబా గంగయ్య ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నాయకులు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కదిరి, ఆదోని వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ.. మరోసారి బీసీల పక్షపాతి తెలుగుదేశం పార్టీ అని నిరూపించిందన్నారు. మహిళలను పార్టీ రాజకీయంగా ప్రోత్సహిస్తోందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు మహిళల ప్రాతినిథ్యం ఎక్కువగా ఉండేలా చూస్తున్నారన్నారు. అలాగే బీసీలకు అత్యధిక అవకాశాలు కల్పించింది కూడా చంద్రబాబేనన్నారు. సామాన్య క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఉన్న మహిళకు, అట్టడుగు వర్గానికి చెందిన వడ్డెర కులానికి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణా వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ.. తమ కులానికి చెందిన దలవాయి రమాదేవి పార్టీ బలోపేతానికి కృషి చేసిందని గుర్తించిన తెలుగుదేశం







పార్టీ సముచిత స్థానం కల్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు మల్లెల జయరాం, కుంచపు వడ్డే వెంకటేశులు, ఈటె స్వామిదాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహ్మద్ ప్రవక్త బోధనలు స్ఫూర్తిదాయకం

## వైసీపీ మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షులు

అనంతపురం, ఆగస్టు 26 అనంత సూర్య : ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలను ప్రపంచానికి చాటిన మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నగర ఉపాధ్యక్షులు మహ్మద్ ఆసిఫ్ పేర్కొన్నారు. మిలాద్–ఉన్–నబీ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. నగరంలోని రామచంద్రనగర్ (నీలిమా సర్కిల్)లో ర్యాలీగా వెళ్తున్న ముస్లిం సోదరులకు పండ్ల రసాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైసీపీ నగర అధ్యక్షులు చింతా సోమశేఖరరెడ్డి, బూత్ విభాగం జిల్లా అధ్యక్షులు ఎద్దుల అమరనాథరెడ్డి హాజరయ్యారు. అలాగే క్లాక్ టవర్ వద్ద కూడా పండ్ల రసాలను అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్ ఆసిఫ్ మాట్లాడుతూ.. 'సర్వమానవాళి శ్రేయస్సు కోసం, శాంతిని నెలకొల్పేందుకు కృషి చేసిన కారణజన్ముడు మహమ్మద్ ప్రవక్త అని, ప్రవక్త జన్మదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటామన్నారు. ఈ పవిత్ర పర్వదినం మత సామరస్యం, సోదరభావం, శాంతి మరింత బలోపేతం కావాలని కోరుకున్నామన్నారు. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు వెల్లివిరియాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు విక్రం సాగర్, పవన్, కార్తిక్, షామీర్, షాషు, సోహెల్, ఇద్రీస్, హర్ష, విశ్వ (శెట్టి), పవర్ దాదు, కైఫ్ తదితరులు పాల్గొన్నారు.





# కళ్యాణదుర్గంలో వైభవంగా

## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి శ్రవణ నక్షత్ర అభిషేకం

(అనంత సూర్య) ఆగస్ట్ 26 కళ్యాణదుర్గం : పట్టణంలోని అనంతపురం రోడ్డులో వెలసిన మహిమాన్విత శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రవణ నక్షత్ర పర్వదినం అత్యంత వైభవంగా, నేత్రపర్వంగా జరిగింది. శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన, సకల ఐశ్వర్యాలను ప్రసాదించే శ్రవణ నక్షత్రం (స్వామి వారి జన్మనక్షత్రం) కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. విశేష పంచామృత అభిషేకం ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని అర్చక స్వాములు వేద మంత్రోచ్చారణల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి వారికి అత్యంత భక్తిశ్రద్ధలతో విశేష పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదారలతో కూడిన దివ్య ద్రవ్యాలతో స్వామివారి మూలమూర్తికి మరియు ఉత్సవ మూర్తులకు జలధార అభిషేకాలు జరిపించారు. మంగళ హారతులు, వేద పండితుల నామస్మరణల మధ్య ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక తరంగాలతో మార్మోగింది. దివ్య అలంకరణ, భక్తజన సందోహం అభిషేకానంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సుగంధ భరితమైన నూతన వస్త్రాలు, పరిమళ వెదజల్లే పవిత్ర పూలమాలలు, తులసీ దళాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. లక్ష్మీసమేతుడై భక్తులను కటాక్ష అభ య ప్రదాత దివ్య రూపాన్ని కనులారా వీక్షించిన భక్తులు తన్మయత్వం చెందారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఓం నమో వేంకటేశాయ నామస్మరణతో ఆలయమంతా భక్తి ప్రపత్తులతో నిండిపోయింది.



# మురళీ..సముచిత స్థానం కల్పిస్తాం

## - దేవళ్ల మురళి దంపతులకు చంద్రబాబు హామీ

అనంతపురం, ఆగస్టు 26 అనంత సూర్య : రాజకీయాల్లో నీకు సముచిత స్థానం కల్పిస్తామని దేవళ్ళ మురళి దంపతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. బుధవారం అమరావతిలోని సెక్రటేరియట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని దేవళ్ళ మురళి దంపతులు ప్రత్యేకంగా కలిశారు. రాజకీయ ప్రస్థానంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం ఎంతో కష్టపడ్డానని, అయితే తనకు సరైన గుర్తింపు ఇవ్వాలని కోరగా.. తెలుగుదేశం పార్టీకి మీరు చేసిన సేవలు అన్ని గుర్తున్నాయని, పార్టీ కోసం కష్టపడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ మరచిపోమన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ పదవి మహిళలకు కేటాయించాలనే ఉద్దేశంతో ఆ పదవి ఇతరులకు ఇచ్చామని, మీకు తప్పకుండా న్యాయం చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు దేవళ్ళ మురళి తెలిపారు. తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, సమయం వచ్చినప్పుడు పార్టీ అందరిని గుర్తిస్తుందని చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి దేవళ్ళ మురళి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.



# మిలాద్ ఉన్ నబీ సందర్భంగా.. అన్నదానం



అనంతపురం, ఆగస్టు 26 అనంత సూర్య : మిలాద్–ఉన్–నబి పండగ సందర్భంగా పాతవూరు పవర్ ఆఫీస్ దగ్గర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తబ్రేజ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, మాజీ నగర మేయర్ వసీం హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని మిలాద్ ఉన్ నబీగా జరుపుకుంటారని, ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం, పరస్పర సహకారం వంటి విలువలను గుర్తు చేశారు. ప్రవక్త బోధనలను పాటిస్తూ శాంతి, సోదరభావంతో జీవించాలని సూచించారు. శాంతియుత సమాజం కోసం మహ్మద్ ప్రవక్త కృషి చేశారని, ఆయన సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు సైఫుల్ల బేగ్, కమర్, షకీల్, మైనార్టీ విభాగం హిదయతుల్లా, వైసీపీ నాయకులు వసీం, ఇమ్రాన్, బెస్త వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ తైక్వాండో పోటీల్లో రాణించిన అన్నాచెల్లెళ్లను అభినందించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, ఆగస్టు 26 అనంత సూర్య : అంతర్జాతీయ టైక్వాండో పోటీలకు ఎంపికైన అన్నా చెల్లెళ్లు మగ్బూల్ బాషా, హజరాబీలను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా అభినందించారు. అనంతపురం మండలం తపోవనం సమీపంలో ఉన్న స్వర్ణగ్రామం వద్ద శిక్షణ పొందిన వీరు తొలిసారిగా జులైలో బెంగళూరులో జరిగిన దక్షిణ భారత స్థాయి తైక్వాండో పోటీల్లో పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. ఈ ప్రతిభ ఆధారంగా హైదరాబాద్ లో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 21 నుంచి 23 వరకు గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో ఇద్దరు చిన్నారులు అద్భుతమైన ప్రతిభతో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో శిక్షకుడు మహబూబ్ బాషా ఈ ఇద్దరు చిన్నారులతో కలసి అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిశారు. చిన్నారుల ప్రతిభ తెలుసుకొని ఎమ్మెల్యే సునీత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఆ చిన్నారులను ఎంతో ఆప్యాయంగా పలుకరించారు. శిక్షకుడిని కూడా ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. మరోవైపు ఆత్మకూరు నూతన ఎస్ఐ గా నియమింపబడిన లక్ష్మణరావు.. ఎమ్మెల్యే పరిటాల సునీతను అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆత్మకూరులో పరిస్థితుల గురించి చర్చించారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ లేకుండా పని చేయాలని సూచించారు. తమ వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే సునీత అన్నారు.



# టిడిపి జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో...

## టిడిపి అధ్యక్షులు భూపేష్ రెడ్డి...

కడప పోరుమామిళ్ల ఆగస్టు 26 :( అనంత సూర్య దినపత్రిక ప్రతినిధి )కడప నగరంలోని ఆర్అండ్బీ గెస్ట్హౌస్లో టీడీపీ జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీబ్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహనణ కార్యదర్శి యనమల సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, పార్టీ సంస్థాగత బలోపేతం, నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువ చేసేలా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది. అలాగే రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణపై కూడా చర్చించారు.



# సర్వీసు ఉపాధ్యాయులకు మళ్లీ అర్హత పరీక్ష ఎందుకు..

## వెంటనే రద్దు చేయాలి - ఏపీటీఎఫ్ 1938 అనంతపురం జిల్లా శాఖ డిమాండ్

అనంతపురం, ఆగస్టు 26 అనంత సూర్య : సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మళ్లీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఎందుకు ? అని.. వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ 1938 అనంతపురం జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఏపీటీఎఫ్ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట ఇన్సర్వీసు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇరవై నుంచి ముప్పై సంవత్సరాలుగా విద్యాబోధనలో సేవలందిస్తూ, కలెక్టర్లు, డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు వంటి ఎందరో విద్యావంతులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు మళ్లీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహించడం అసంబద్ధమైన విధానమని మండిపడ్డారు. తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం ఎన్.సి.టి.ఈ నిబంధనల సవరణ కొరకు శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపి, ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్షను శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రద్దు అమల్లోకి వచ్చే వరకు ప్రత్యేక మినహాయింపులతో ప్రత్యేక పరీక్ష నిర్వహించాలని కోరారు. ఇటీవల విడుదల చేసిన ప్రత్యేక పరీక్ష ప్రకటనలో మినహాయింపులు కల్పించలేదని, గత పరీక్ష ఫలితాలు విడుదల కాకుండానే మరో పరీక్ష నిర్వహించడం సరికాదని అన్నారు. ప్రస్తుత ప్రకటనను రద్దు చేసి, ఆఫ్లైన్ పరీక్ష, అందరికీ నలభై శాతం ఉత్తీర్ణత మార్కులు, ప్రస్తుతం బోధిస్తున్న సబ్జెక్టులోనే ప్రశ్నలు, డిసెంబరులో పరీక్ష వంటి సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని ఉపాధ్యాయ అర్హత పరీక్ష రద్దు కోసం భారీ ఉద్యమం చేపడతామని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రవీంద్ర, ప్రధాన కార్యదర్శి హనుమప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నాయక్, జోనల్ నాయకులు బుటారి వెంకటేశులు, రాష్ట్ర, జిల్లా నాయకులు జిల్లా నాయకులు పోతులయ్య, మహమ్మద్ రఫీ, సత్యప్రసాద్, సాకే భాస్కర్, ఆంజనేయులు నాయక్, వజీర్ భాష, నాగరాజు, హనుమంతు, రామాంజనేయులు, చెన్నకేశవులు, కృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఫెడరేషన్ నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405